భానుడి భగభగ.. జనం విలవిల

మానకొండూర్: రోజురోజుకూ భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 8 గంటల దాటిందంటే భగభగ మండిపోతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండవేడిమి తాళ లేక అల్లాడుతున్నారు. ఇంట్లో నుంచి భయటకు రావాలంటే జంకుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఇంటి నుంచే వెళ్లేవారు వడదెబ్బ బారిన పడకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నెత్తిన టోపీలు, హెల్మెట్, చేతిరుమాలు చున్నీలు, గొడుగుల ద్వారా ఎండ నుంచి రక్షణ పొందుతున్నారు. రహదారిలో కీరా, కూల్‌డ్రింక్స్, మజ్జిగ ప్యాకెట్లు, చలివేంద్రాల వద్దచల్లని నీటి తాగుతూ దాహార్తిని తీర్చుకుంటున్నారు. హమాలీలు, ఉపాధి కూలీలు, కర్షకులు 12 గంటల లోపే పనులు ముగించుకొని ఇంటికి చేరుకుంటున్నారు. మరికొందరు చెట్లు నీడలో సేద తీరుతున్నారు. సాయంత్రం సూర్యుడి తాపం తగ్గాక పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఇంకా ఎన్ని రోజులు ఎండవేడిమి భరించాలోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


శంకరపట్నంలో మట్టికుండల కొనుగోలు


అన్నారంలో మజ్జిగ ప్యాకెట్లు తీసుకెళ్తున్న వ్యక్తి



చిగురుమామిడిలో చలివేంద్రం ఏర్పాటు


శంకరపట్నం: రహదారి పక్కన పుచ్చకాయల కొనుగోలు


మానకొండూర్: లలితాపూర్‌లో నీడపట్టుకు వెళ్తున్న మహిళలు


మానకొండూర్: ఎండలో బైక్‌పై ప్రయాణం



శంకరపట్నంలో చలివేంద్రం వద్ద దాహార్తి తీర్చుకుంటున్న ప్రజలు

క్లుప్తంగా

ఫిజికల్ డైరక్టర్ రాజిరెడ్డికి సన్మానం


రాజిరెడ్డిని సన్మానిస్తున్న వాకర్స్

హుజూరాబాద్: విద్యార్థులు, యువకుల్లో క్రీడా నైపుణ్యం పెంచుతున్న ఫిజికల్ డైరక్టర్ కొన్నె రాజిరెడ్డిని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎదులాపురం వాకర్స్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి వాకర్స్‌కు చేస్తున్న సేవలను వివరించారు. డబ్బుల కోసం కాకుండా సేవే లక్ష్యంగా పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతాప శ్రీనివాస్, భూసారపు శంకర్, ప్రతాప రమేశ్, ప్రభాకర్ రెడ్డి, దుర్గై రాజు, బండి రమేష్, పంజాల రవీందర్, బుసారపు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, సారంగపాని, షరీఫ్, శ్రీనివాస్, మునిరొద్దీన్, శ్రీధర్, సంతోష్ పాల్గొన్నారు.

రేపు వీణవంకకు మాజీ సీఎం కేసీఆర్ రాక

వీణవంక: మాజీ సీఎం కేసీఆర్ 4న రాత్రి వీణవంకకు రానున్నారని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2న జమ్మికుంటలో రోడ్డు షోతో పాటు వీణవంకలో కౌశిక్ రెడ్డి ఇంట్లో రాత్రి కేసీఆర్ బస చేసేది కానీ ఎన్నికల కమిషన్ 48 గంటల పాటు ప్రచారం నిషేదించిడంతో షెడ్యూల్‌లో మార్పులు చేశారు. 4న రాత్రి 10గంటలకు వీణవంకకు చేరుకుంటారని, 5న మధ్యాహ్నం ఒంటి గంటకు నియోజకవర్గ ప్రజలతో ఆత్మీయ సమ్మేళనంలో కేసీఆర్ పాల్గొంటారని కౌశిక్‌రెడ్డి తెలిపారు.

రేపు విద్యార్థులతో కలెక్టర్ సదస్సు


మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహారెడ్డి

హుజూరాబాద్: హుజూరాబాద్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 4వ తేదీన పదో తరగతి ఫెయిలైన విద్యార్థులతో కలెక్టర్ సదస్సు నిర్వహించున్నారని హుజూరాబాద్ ఎంఈఓ కేతిరి వెంకటనరసింహారెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం మాట్లాడుతూ.. సదస్సులో జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్ రావుతో పాటు ఇతర అధికారులు, పిల్లల తల్లిదండ్రులు హాజరవుతారని తెలిపారు.

షోకాజ్ నోటీస్ అందజేత

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్ సహకార సొసైటీ సంఘంలో ఆర్థిక లావాదేవీలు దుర్వినియోగమైనట్లు సంఘం డైరెక్టర్లు జిల్లా కోఆపరేటివ్ అధికారికి నెల రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. డైరెక్టర్ల ఫిర్యాదు మేరకు ఆడిటర్ రాజు సంఘంలోని ఆర్థికలావాదేవీలపై విచారణ చేపట్టారు. విచారణ అనంతరం డీసీఓ శ్రీరామానుజాచారి చైర్మన్ ముద్దసాని ప్రదీప్‌రెడ్డి, సీఈఓ ఎం. రవీందర్‌కు షోకాజ్ నోటీసులను జారీచేశారు. ఈవిషయమై సంఘం డైరెక్టర్లు డీసీఓ లేఖప్రకారం అత్యవసర పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని చైర్మన్‌కు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం


క్యాంపు ప్రారంభిస్తున్న జనార్దన్

శంకరపట్నం: మండలంలోని లిటిల్‌ఫ్లవర్ క్రీడా ప్రాంగణంలో గురువారం పాఠశాల చైర్మన్ వంగ జనార్దన్ రగ్బీ సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, 15రోజులు నిర్వహించే క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రగ్బీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు నిరంజన్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంతోష్, పృథ్వీరాజ్, శివ తదితరులున్నారు.

ఎల్‌వోసీ అందజేత



శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన ఉడుత హరీశ్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రూ.లక్షా ఇరవైవేల ఎల్‌వోసీని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. హరీశ్‌కు పార్టీ నాయకులు బసవయ్య, సంతోష్, మధు, శ్రీనివాస్, ప్రవీణ్ చెక్కును అందజేశారు.

నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి

• ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్

గంగాధర: వేసవి దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ గంగాధర్ వడ్లకొండ గంగాధర్ అధికారులకు సూచించారు. మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న 33/11కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్ పనులను గురువారం పరిశీలించారు. పనులు వేగవంతం చేసి వచ్చే రబీ సీజన్ లోపు ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. సబ్‌స్టేషన్‌లోని 11కేవీ ఫీడర్స్ అంతరాయం కలగకుండా చూడాలని ఏఈని ఆదేశించారు. నిరంతరం సరఫరా కోసం మధురానగర్‌లో కొత్తగా బ్రేకర్, అదనపు కెపాసిటర్ ఏర్పాటు చేశామని, వదులుగా ఉన్న లైన్ల మధ్య 140 పోల్స్ వేశామని 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు వివిధ గ్రామాల్లో 7 వేసినట్లు, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 3, 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు3 ఏర్పాటు చేశామన్నారు. గంగాధర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట డివిజనల్ ఇంజనీర్ ఎం. తిరుపతి, ఏడీఈ సత్యనారాయణ, ఏఈ సవాయినాయక్, సబ్ ఇంజనీర్ అనిల్‌సాయి తదితరులు ఉన్నారు.


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ గంగాధర్

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

రామడుగు: మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని గంగాధర్ అన్నారు. మండలంలోని గుండి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సమస్యలపై సబ్‌స్టేషన్‌లో తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. డీఈ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

దేవుని పేరుతో బీజేపీ రాజకీయం

• కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు

వీణవంక: కాంగ్రెస్‌తోనే రామరాజ్యం సాధ్యమని, బీజేపీని ఓడించకపోతే మన కన్ను మనమే పొడుచుకున్నట్లు అవుతుందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేవుని పేరుతో రాజకీయం చేయడం బీజేపీకే దక్కుతుందన్నారు. ప్రణవ్ మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డి సానుభూతి ఓట్ల కోసం ప్రయత్నిస్తున్నాడని, సెంటిమెంట్ రాజకీయాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి, పత్తి క్రిష్టారెడ్డి, తదితరులు ఉన్నారు.

గన్నేరువరం: సనాతన ధర్మాన్ని పాటించాలనే అంశాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలనే ఆలోచన చేస్తున్న బీజేపీ కేంద్రంలో మరోసారి అధికారంలోకి వస్తే మనువాద సిద్ధాంతం ముందుకు తీసుకువచ్చి అంటరానితనాన్ని పెంచిపోషిస్తోందని రాజేందర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ రైతు సమన్వయ సమితి మాజీ మండల కన్వీనర్ బోడ మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ కుమ్మరి సంపత్, బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్, మరో 100 మంది ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి ..మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్న బీజేపీ దళితులను ఊచకోత కోస్తుందని, మరోమారు కేంద్రంలో పార్టీ అధికారంలోకి వస్తే దళితుల పరిస్థితి అగమ్యగోచరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంటను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని రాజేందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. దేవస్థానానికి వచ్చే భక్తులు, ప్రయాణికులకు బస్టాప్ సౌకర్యం కల్పిస్తామన్నారు.


వీణవంకలో మాట్లాడుతున్న రాజేందర్‌రావు

ఎంపీ ‘బండి’కి మతిభ్రమించింది

కరీంనగర్: ఎంపీ బండి సంజయ్‌కి మతిభ్రమించిందని, ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన ‘బండి’ ఇష్టారాజ్యంగా ఆరోపణలు చేస్తున్నాడని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు మండిపడ్డారు. గురువారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ.. మ్యాచ్ ఫిక్సింగ్‌కి బండి సంజయ్ బ్రాండ్ అంబాసిడర్ లాంటివాడని, మాజీ డీజీపీ ప్రభాకర్ రావుతో తనకు సంబంధాలు ఉన్నాయని బండి సంజయ్ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ ఫోన్ టాపింగ్‌కు తెర తీసిందే బీజేపీ అని, కేసీఆర్ బీజేపీతో అనుకూలంగా ఉండేందుకే ఫోన్ టాపింగ్ ప్రక్రియ నిర్వహించారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నాయకులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

• ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని, బీజేపీ, బీఆర్‌ఎస్ రెండో స్థానానికి పోటీ పడుతున్నాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అడు. మండలంలోని మధురానగర్ పార్టీ కార్యాలయంలో గురువారం ర్యాలపల్లి ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డితో పాటు దాదాపు రెండువందల మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించాడు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మకంతో ఉన్న ప్రజలు కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్ రావును గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు నాయకులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ గెలుపు కోసం పని చేయాలన్నారు. నాయకులు పురమల్ల మనోహర్,రాజగోపాల్‌రెడ్డి, వెలిచాల తిరుమల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

చొప్పదండి: మండలంలోని చాకుంట తాజా మాజీ సర్పంచ్ పెద్ది శంకర్ కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ ఎంపీ అభ్యర్థి రాజేందర్ రావు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. దేశాయిపేటలో కుల సంఘాల నాయకులు పాకాల మల్లేశం గౌడ్, వడ్లకొండ కొమురయ్య, పెరుమాండ్ల రాములుగౌడ్, పూరెళ్ళ రవిందర్, సింగిరెడ్డి ప్రకాశ్ రెడ్డి, మోర చంద్రయ్య, తదితరులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గంగాధర: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్యం

రేకొండలో నాయకుల ప్రచారం

చిగురుమామిడి: మండలంలోని రేకొండలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగానే దేశంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే అన్ని వర్గాల ప్రజలు క్షేమంగా ఉంటారని, చేతి గుర్తుకు ఓటు వేసి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. డీసీసీ అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు సునీల్, యువజన కాంగ్రెస్‌జిల్లా కార్యదర్శి నరేశ్, మాజీ ఉపసర్పంచ్ మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో చురుగ్గా పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రామడుగు: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్, బీజేపీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ...బూత్ స్థాయిలో కార్యకర్తలు చురుగ్గా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉప్పు రామకృష్ణ, నాయకులు ఉప్పు శ్రీనివాస్, పొన్నం శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, రాము, శివ, కుమార్, నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్‌కార్నర్ సమావేశం విజయవంతం చేయాలి


సన్నాహక సమావేశంలో నాయకులు

ఇల్లందకుంట: బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం ఐదుగంటలకు హుజూరాబాద్‌లో నిర్వహించే స్ట్రీట్ కార్నర్ సమావేశంలో పాల్గొంటున్నారని నియోజకవర్గంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతంచేయాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు రమేష్ ,శ్రీధర్‌రెడ్డి, రాజేందర్,పవన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


రాజిరెడ్డి (ఫైల్)

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముదుగంటి రాజిరెడ్డి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన గ్రామానికి రెండో సర్పంచ్‌గా పని చేసి గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గ్రామస్తులు తెలిపారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన ముగ్గురికి కరీంనగర్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. కరీంనగర్‌లో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 16 మందిని కోర్టులో హాజరు పర్చగా ముగ్గురికి జైలుతో పాటు జరిమానా, 13 మందికి జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్‌లో ప్రతిరోజూ ప్రత్యేక తనిఖీలు ఉంటాయని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన పారిపెల్లి సంపత్‌రెడ్డి (43) ఏప్రిల్ 24న పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు.. గంగిపల్లి గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు కాగా పెద్ద కూతురు రమాదేవి మార్చిలో గ్రామానికి చెందిన వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. అప్పటి నుంచి రమాదేవి,భర్త వరకట్నం కింద భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని, డబ్బులైనా ఇవ్వాలని సంపత్‌రెడ్డిని వేదింపులకు గురి చేశారు. వేదింపులు భరించలేక సంపత్‌రెడ్డి వ్యవసాయబావి వద్ద పురుగుమందు సేవించాడు. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన భర్తను వేదించడం వల్లనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కూలీలతో ముచ్చటించిన ‘పొన్నం’

జమ్మికుంట: మండలంలోని నాగంపేట కార్నర్ మీటింగ్‌కు గురువారం హాజరవుతున్న క్రమంలో ధర్మారం, కొత్తపల్లి గ్రామాల మధ్య రోడ్డు వెంట ట్రాలీ ఆటోలో మహిళా కూలీలు వెళ్తుండగా మంత్రి పొన్నం ప్రభాకర్ వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని మహిళలకు వివరించారు. ఎన్నికల అనంతరం కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు దేశినికోటి, సలీం, తదితరులు పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్

పదేళ్లలో బీజేపీ అభివృద్ధి శూన్యం

• మతరాజకీయాలతోనే పబ్బం
• కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుంది
• బీఆర్‌ఎస్ అభ్యర్థి ‘బోయినపల్లి’

మానకొండూర్: కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యమని, మత రాజకీయాలతో పబ్బం గడుపుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిందని బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ విమర్శించారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని లలితాపూర్, పచ్చునూర్ గ్రామాలలో పర్యటించారు. ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక అవుతానని అన్నారు. యాసంగి నుంచి క్వింటాల్‌కు ఐదువందల బోనస్ ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం నోరుమెదపడం లేదన్నారు. జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ శేఖర్, ఎంపీటీసిలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గన్నేరువరం: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, మహిళ విభాగం అధ్యక్షురాలు కుసుంభ నవీన, నాయకులు, కార్యకర్తలు గురువారం బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలకేంద్రం గన్నేరువరం, ఖాసీంపేట, మాదాపూర్, పారువెల్ల, మైలారం, చీమలకుంటపల్లెతో పాటు వివిధ గ్రామాల్లో ప్రచారం చేపట్టి కారు గుర్తుకు ఓటువేసి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీ గెలిపించాలని కోరారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో బోయినపల్లి వినోద్‌కుమార్ కోడలు డాక్టర్ హర్షిణి, ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తాలో మాట్లాడుతూ.. పార్లమెంటులో బీఆర్‌ఎస్ గొంతుక వినిపించాలంటే బోయినపల్లి వినోద్ కుమార్‌కు ఓటువేయాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గతంలో ఎంపీగా ఉన్న బండి సంజయ్‌కుమార్ జిల్లాకు చేసిందేమిలేదన్నారు. బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కత్తుల రమేశ్, ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బొమ్మనపల్లిలో ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో కౌన్సిలర్ మొలుగు సృజనపూర్ణచందర్ ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. అమలు కానీ హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిందన్నారు. కాంగ్రెస్‌పై కొద్ది రోజుల్లోనే ప్రజల్లో అసంతృప్తి నెలకొందని, పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.

తిమ్మాపూర్: మండలంలోని పోరండ్ల, మన్నెంపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో బోయినపల్లి వినోద్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి కావాలా.. విధ్వంసం కావాలో ప్రజలు తేల్చుకోవాలని సూచించారు. బీజేపీ చేసింది చెప్పలేక దేవుడు పేరుతో ఓట్లు అడుగుతుందని, మత రాజకీయాలతో పబ్బం గడుపుతున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్ కుమార్ గెలుపే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మండల అధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘కుట్ర పూరితంగానే సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు’


మాట్లాడుతున్న రెడ్డి సంఘం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన అనుకూలమైన ఢిల్లీ పోలీసుల ద్వారా నోటీసులు ఇప్పించిందని తెలంగాణ రెడ్డి సంఘం నాయకులు ఆరోపించారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఏమి లేనందున చెప్పుకోలేక రేవంత్‌రెడ్డిని ఎదుర్కోలేక నోటీసులు ఇప్పించి మానసిక ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. రేవంత్‌రెడ్డికి తెలంగాణ ప్రజలు అండగా ఉంటారని అన్నారు. రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ భూముపల్లి రాఘవరెడ్డి, నాయకులు వంచ సుదర్శన్‌రెడ్డి, నిమ్మ భరత్‌రెడ్డి, చింతల శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చింతిరెడ్డి రమణారెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, గీట్ల అనందరెడ్డి, ఈద మధూకర్ రెడ్డి, రాజిరెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.